# మలుపు

**ఆ**టో దిగి కలెక్టరాఫీసు ప్రాంగణంలోకి అడుగు పెట్టింది కామేశ్వరి. టైం పన్నెండవుతోంది. సూర్యభగవానుడు ఆకాశం నడిబొడ్డుకొచ్చి నిప్పులు చెరుగుతున్నాడు. ఎండవేడిమికి తట్టుకోలేక చెట్లమీద కాకులు కావ్ కావ్ అని అరుస్తున్నాయి.

చెట్ల నీడన కాస్సేపు సేదదీర్చుకుని లోనికెళ్ళింది. కలెక్టరు గారు ఛాంబర్‌లో ఉన్నట్లుంది. స్టాఫంతా ఎవరి సీట్లో వారు కూర్చుని శ్రద్ధగా పనిచేసుకుంటున్నారు.

బెరుకుగా అటు ఇటు చూస్తూ మెల్లగా ముందుకు సాగింది.

"ఎవరు కావాలి?" అడిగాడు సూపరింటెండెంట్ సత్యారావు.

"కలక్టరుగారు" తడుముకోకుండా సమాధానమిచ్చింది కామేశ్వరి.

ఆమె నోమారు యగాదిగా చూసి "ఇప్పుడు కుదర్దు. ఆవిడ బిజీగా ఉన్నారు. సోమవారం గ్రీవెన్స్ ఉంటుంది అవేళ రా" అన్నాడు.

అతడి మాటల్లో నిర్లక్ష్యం ధ్వనిస్తోంది.

"అలా అనకండి సార్ కలెక్టర్ కల్యాణిగారు నాకు బాగా కావలసినవారు. నేనొచ్చానని చెబితే కాదనరు. ఆమెను చూడాలని ఎంతో దూరం నుంచి వచ్చాను" బ్రతిమాలాడింది కామేశ్వరి.

ఆ మాటకు ఏమనుకున్నాడో ఏమో "వివరాలు రాసివ్వు ఛాంబర్‌కి పంపిస్తాను" అన్నాడు. ముఖం చిట్లిస్తూ.

కాగితం తీసి తనపేరు ఊరు రాసిచ్చింది.

స్లిప్పు ఛాంబర్‌లో కెళ్ళిందో లేదోఫారమాలిటీస్ పక్కనపెట్టి రివ్వున బయట కొచ్చింది కళ్యాణి.

కలెక్టర్‌గారి రాకతో స్టాఫంతా వేచి నిలబడ్డారు.

"కామడూ!" అంటూ కామేశ్వరిని కౌగలించుకుంది కల్యాణి.

"కల్యాణీ!" అన్నది కామేశ్వరి ఆనందంలో ఉబ్బి తబ్బి బౌతు.

వారిరువురూ ఒకరి కొకరు ఏమౌతారో తెలీక తెల్ల మొహాలేసి చూస్తున్నారంతా.

సూపరింటిండెంట్ సత్యారావు సంగతి సరేసరి.

కామేశ్వరి చేయి పుచ్చుకుని తన గదిలోకి తీసుకెళ్ళింది కళ్యాణి. కాస్సేపు ఇద్దరూ

కబుర్లు చెప్పుకున్నాక రిసీవర్ లిఫ్ట్ చేసి జె.సి.మంజూషను తన ఛాంబర్‌కి రమ్మంది.

ఆ జిల్లాకి కలెక్టరు, జాయింట్ కలెక్టరు మహిళలే కావడం విశేషం. వాళ్ళు ఏ ముహూర్తాన అక్కడ అడుగుపెట్టారో గాని ఇట్టే కలిసిపోయారు.

"రండి, ఈమె నా చిననాటిస్నేహితురాలు కామేశ్వరి. మీకు ఇంట్రడ్యూస్ చేద్దామని పిలిచాను" అంది కల్యాణి మంజూషను చూసి నవ్వుతూ.

"వెరీ గ్లాడ్ టు సీయు" కామేశ్వరి చేయి అందుకుంది మంజూష.

ముగ్గురూ అవి ఇవి కాస్సేపు చెప్పుకున్నాక వస్తానని చెప్పి లేచింది మంజూష.

"ఔనూ, నేను ఇక్కడున్నానని నీకెలాతెలిసింది?" అడిగింది కల్యాణి.

ఆ మాటకు పకపకా నవ్వింది కామేశ్వరి.

"ఎందుకలా నవ్వుతావ్" అడిగింది కల్యాణి బుగ్గన గంటు పెట్టుకుని.

"నవ్వక ఏం చేయనే. జిల్లా అధికారిణివి నీ ఉనికి తెలియడం విడ్డూరమా! నిత్యం మీడియాలో దర్శనమిస్తూనే ఉన్నావు కదా!... నిన్న టి.విలో చూసాను" అంది స్నేహితురాలి కళ్ళల్లో కళ్ళుంచి.

"పనిగట్టుకుని వచ్చావంటే ఏదో విశేషమే ఉండాలి. అంది కల్యాణి నవ్వుతూ.

"ఊఁ ... వచ్చే ఆదివారం నా పెళ్లి" హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి పెళ్లి పత్రిక తీసిస్తూ అంది కామేశ్వరి.

"కంగ్రాట్స్. ఐయామ్ ఎక్స్ట్రీమ్లీ హ్యాపి. ఇంతకు ఈ అందాల అపరంజిని ఎగరేసుకుపోతున్న అదృష్టవంతుడెవరో తెలుసుకోవచ్చా"

"నువ్వు ఊహించేటంత గొప్పవాడు కాకపోయినా నాకు నచ్చిన వ్యక్తి. నన్నుమెచ్చిన మనిషి. నీకు తెలిసే ఉంటుంది మన ఊరి సహకారబ్యాంకులో నైట్ వాచర్‌గా పనిచేసే నారాయణ" చెప్పింది కామేశ్వరి.

ఆ మాటకు కల్యాణి మొహం మ్లానమైంది. "ఇంతకంటె మెరుగైన సంబంధం ఏదీ నీకు దొరకలేదా" అని చీవాట్లేస్తున్నట్లున్నాయి ఆమె చూపులు.

"మా ఇంటి పరిస్థితులు నీకు తెలియనివికావు. నాన్న కట్నాలు గుమ్మరించి నాకు పెళ్లి చేయలేదు. వయసేమో మూడు పదులు దాటిపోయాయి. చదువా అంతంత మాత్రం. నేను ఇంతకంటె గొప్పజీవితాన్ని ఆశించడం అత్యాశే అవుతుంది" స్నేహితురాలిమనసు అద్దం పట్టినట్లు అంది కామేశ్వరి.

"అహ, అదికాదు నా ఉద్దేశం" అన్నది కల్యాణి ఆమె మనసు నొప్పించినందుకు

నొచ్చుకుంటూ.

"ఇక నేనెళ్ళిరానా" అంది కామేశ్వరి లేచి నిలబడి.

"రావడం, పోవడం అంతా నీ ఇష్టమేనేంటి? ఆ పప్పులేం ఉడకవ్. ఈ రోజు నాతోనే గడపాలి. మనం కబుర్లాడుకోవలసినవి ఎన్నో ఉన్నాయి.

"సారి... చీకటిపడకుండా వచ్చేస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాను. ఆలశ్యమైతే అంతా కంగారు పడతారు. నువ్వు తప్పకుండా పెళ్లికి రావాలి సుమా!" అంది కామేశ్వరి.

"పెళ్లికి వరుడు లేకపోయిన పరవాలేదు. నేను లేకుండానా! నెవర్" అంది కల్యాణి నవ్వుతూ.

ఆ మాటకు ఫక్కున నవ్వింది కామేశ్వరి.

ఉన్నపళంగా షాపుకు తీసుకెళ్ళి రవ్వల నక్లెస్ కొని "ఇది నీ పెళ్లికి అడ్వాన్స్ గిఫ్ట్" అంటూ ఆమె చేతిలో పెట్టింది కల్యాణి.

కామేశ్వరి కళ్ళు చెమ్మగిల్లాయి. ఏళ్ళు గడచినా ఆమెకు తన పట్ల ప్రేమ ఏమాత్రం తరిగిపోనందుకు ఎంతో సంతోషంగా వుంది.

తిరిగి ఇరువురూ ఆఫీసుకొచ్చారు.

డ్రైవర్‌ని, పిలిచి కామేశ్వరిని జాగ్రత్తగా వాళ్ళ ఊరికి దిగబెట్టమంది కల్యాణి.

మరునాడు కల్యాణి ఛాంబర్ కొచ్చిన మంజూష "మీ ఫ్రెండ్ కామేశ్వరి గారేరి?" అని అడిగింది.

"వెళ్ళిపోయింది. తనకి మ్యారేజంట. ఇన్విటేషన్ ఇవ్వడానికొచ్చింది. ఉండమని ఎంత చెప్పినా వినలేదు. తన కోసం అక్కడ అంతా ఎదురుచూస్తారంటూ వెళ్ళిపోయింది".

"ఆమెను మీ ప్రక్కన కూర్చోబెట్టుకున్నప్పుడే అనుకున్నాను కామేశ్వరిగారు మీకెంతో ఆప్తురాలైఉంటారని".

"మీరన్నట్లు ఆప్తురాలే కాదు. నా పాలిట దేవత. నా జీవితం మలుపు తిరగటానికి కామేశ్వరే కారణం. నేనివాళ ఈ హోదాలో ఉన్నానంటే అంతా ఆమె చలవే. అది నాకు నూరిపోసిన ధైర్యమే నన్నింత దాన్ని చేసింది. దాని ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను".

కల్యాణి మాటలకు విస్తుపోయి చూసింది మంజూష.

ఆమె ఆసక్తిని గ్రహించి గతంలోకెళ్ళింది కల్యాణి.

❖ ❖ ❖

చిన్నప్పుడు కల్యాణి, కామేశ్వరి ఒకే స్కూల్లో చదూకున్నారు. ఇద్దరూ క్లాస్‌మేట్స్.

కామేశ్వరి చదువులో యావరేజిగా ఉండేది. కల్యాణికి మాత్రం అన్ని సబ్జక్టులలో ఫస్టుమా ర్కులొచ్చేవి. అయినా కామేశ్వరికి ఆమెపట్ల ఏమాత్రం అసూయుండేదికాదు. ఇరువురూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

ఇలా ఉండగా ఓ రోజు విధి కన్నెర్రజేసింది. కూతుర్ని ఇంట్లో ఉంచి బంధువుల పెళ్లికి కాకినాడవెళ్ళిన కల్యాణి తలిదండ్రులు తిరుగు ప్రయాణంలో బస్సు ప్రమాదానికి గురై మృతి చెందారు.

ఆ వార్తకు కుప్పకూలిపోయింది కల్యాణి. కన్నవారి మృతదేహాల మీద పడి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఆ పసిదాన్ని ఓదార్చడం ఎవరివల్ల కావడంలేదు. అమ్మానాన్న ఇద్దరూ పోవడంతో అనాథ అయింది. పరామర్శకొచ్చిన బంధువులెవరూ ఆ పిల్ల బాధ్యతను తీసుకుంటామనలేదు. తమకే సంబంధం లేకున్నా ఆ పసిదాన్ని అక్కునజేర్చుకున్నారు పొరుగున ఉన్న రాజారావు దంపతులు. వారి ఆర్థిక స్థితి గతులు అంతంత మాత్రంగావున్నా ఆ పిల్లకు ఇంత తిండిపెట్టి టెన్త్ వరకు చదివించారు. కల్యాణి పదోతరగతి చదూతూ ఉండగా కృష్ణమూర్తికి ఆ పిల్ల మీద కన్నుపడింది. అతడు ఆ ఊళ్ళో మోతుబరి. కల్యాణిని చేసుకుంటానని తన అనుయాయులతో కబురంపాడు. అయితే అతడికి ఇదివరకే పెళ్లైంది. మనువాడిన మూన్నాళ్ళకే పెళ్ళాం పోవడంతో అంతా అతడిని నష్టజాతకుడన్నారు. మళ్ళీ పెళ్లికి సిద్ధపడ్డా పిల్ల నివ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆ కారణంగా నలభై ఏళ్ళు దాటినా అతడు ఓ ఇంటివాడు కాలేకపోయాడు. ఒక సారి అలా జరిగినంతమాత్రాన ఎప్పుడూ కీడే జరుగుతుందని ఎందుకనుకోవాలి? కల్యాణికి తామెలాను కట్నాలిచ్చి పెళ్లి చేయలేరు. కృష్ణమూర్తి కోరి చేసుకుంటానంటున్నాడు. కాదనడం దేనికి? పైగా అతడా ఊళ్ళో అంతో ఇంతో భూమి పుట్ర ఉన్నవాడు. కల్యాణిని అతనికిచ్చి చేస్తే పిల్ల సుఖపడుతుందనుకుని ఆమెను పెళ్లికి ప్రేరేపించారు. తన ప్రమేయం లేకుండానే ముహూర్తం పెట్టేయడంతో కల్యాణి మానసికంగా కృంగిపోయింది. తన ఆవేదనను చెప్పుకోడానికి అమ్మలేదు. అక్కునజేర్చుకుని ఓదార్చే కన్నతండ్రిలేడు. తనకు చదూకోవాలని వుంది. చేరదీసినవాళ్ళు తననిక సాకలేరని తెలుసు అందుకే నోరు విప్పలేకపోయింది. ఒకవైపు వివాహం మరో వంక పదోతరగతి పబ్లిక్ పరీక్షలు. ఎగ్జామ్స్ అయిన మరునాడే తను పెళ్లిపీటల మీద కూర్చోవాలి. పెళ్లంటే ఏంటో తెలియని వయసు తనది. అయినా చేసుకోకతప్పదు. మైనరు బాలికకు పెళ్లేంటని ఊళ్ళో ఏ పెద్దమనిషి అడగలేదు. ఏంచెయ్యాలో తెలీక రాత్రంతా ఏడుస్తూ కూర్చుంది.

మారునాడు క్లాస్‌లో తోటిపిల్లలతో తన గోడు వెళ్ళబోసుకుంది. సానుభూతి

కనపరచడం తప్ప పాపం వాళ్ళు మాత్రం ఏంచెయ్యగలరు? ఎవరు నోరు మెదపకపోయినా కామేశ్వరి ఊరుకోలేదు.

కల్యాణి భుజంమీద చెయ్యవేసి "భయపడకు కలీ, ముందు పరీక్షలు బాగారాయి. పెళ్లి సంగతి నాకు విడిచిపెట్టు" అంటూ ఆరిందలా అభయమిచ్చింది.

ఆ రోజు చివరి పరీక్ష మరునాడు పెళ్లి కల్యాణి కదలికలను కనిపెట్టిన కృష్ణమూర్తికి ఆ పిల్ల మీద అనుమానం వచ్చింది. ఎందుకైనా మంచిదని ముందు చూపుతో తన మనుషుల్ని పరీక్షకేంద్రం వద్ద నిలబెట్టాడు. పరీక్ష అయిన వెంటనే ఆమెను దగ్గరుండి ఇంటికి తీసుకురమ్మని ఆదేశించాడు.

పేపరు రాస్తూ మధ్యలో మంచినీళ్ళకని వరండాలోకొచ్చింది కామేశ్వరి. గేటుముందు అనుమానాస్పదంగా తచ్చాడు తున్న కృష్ణమూర్తి మనుషుల్ని చూసేసరికి గుండె దడ దడలాడింది. పరీక్ష ముగిసిన మరుక్షణం విషయం కల్యాణి చెవిలో ఊదింది.

యమకింకరుల్లావున్న కృష్ణమూర్తి మనుషుల్ని చూసిన కల్యాణికి పై ప్రాణాలుపైకి పోయాయి. వాళ్ళ కన్ను గప్పి బయటపడటం అసాధ్యం. ఇక తన పెళ్లిని ఆ దేవుడు కూడ ఆపలేడనుకుంది.

బెల్ అవడమేంటి అభ్యర్థులంతా ఒక్క ఉదుటన ప్రవాహంలా బయటపడ్డారు. వారిలో కల్యాణిని గుర్తించలేక దిక్కులు చూస్తూ నిలబడ్డారు కృష్ణమూర్తి అనుచరులు.

ఇదే అదునుగా భావించిన కామేశ్వరి కల్యాణి చేయిపుచ్చుకుని వాళ్ళ కంటబడకుండా మెల్లగా దొడ్డిదారిన బయటకు లాక్కెళ్ళింది. అక్కడ నుంచి వాళ్ళుతిన్నగా మండల పోలీస్‌స్టేషన్ చేరుకున్నారు.

ఇష్టంలేని పెళ్లికి పెద్దలు బలవంతం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేద్దామంది కామేశ్వరి. భయంగావున్నా ప్రాణాలుగ్గబట్టి సరేనంది కల్యాణి. తన తెగింపుకు కామేశ్వరి సహకారం తోడవడంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చిందామెకి. గభాలున ఇన్సిపెక్టర్ కాళ్ళ మీద పడి విల విలా ఏడ్చింది.

ఈ హఠాత్సంఘటనకు బిత్తరపోయిన పోలీస్ ఇన్సిపెక్టరు నెమ్మదిగా ఆమెను లేవదీసి భయపడవద్దని అభయమిచ్చాడు. ఆ పిల్ల నెవరైనా తరుముకొస్తున్నారేమోనని అటు ఇటు చూసాడు.

విషయం వివరించింది కామేశ్వరి.

కల్యాణి మనోధైర్యానికి నివ్వెర పోయారు పోలీసులు. విషయం బయటకు ఎలా

పొక్కిందో ఏంటో ప్రెస్‌వాళ్ళు ఎలక్ట్రానిక్ మీడియావాళ్ళు వచ్చారు.

వాళ్ళు వేసే ప్రశ్నలకు ఉక్కిరి బిక్కిరైంది కల్యాణి. "నేటి బాలికలంతా కల్యాణీ నుంచి స్ఫూర్తిని పొందాలంటూ మీడియా ముందు గళం విప్పాడు ఇన్స్పెక్టర్ సుధీర్. ఉన్నపళంగా రాజారావు దంపతుల్ని పిలిపించి విచారించాడు.

తనకు పెళ్లి వద్దని, చదూకుంటానని అందరి ముందు తెగేసి చెప్పింది కల్యాణి. ఆమె ఆత్మస్థైర్యానికి అచ్చరువొందిన పోలీసులు విజయనగరం యస్.ఐ.తో, న్యాయనిపుణులతో సంప్రదించి ఆ పిల్లని బాలికల సంరక్షణాగృహానికి తరలించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కల్యాణిని ఓ కార్పొరేట్ కాలేజీ వాళ్ళు తమ కళాశాలలో ఉచితంగా సీటిచ్చారు. హాస్టల్‌లో చేర్పించారు. డిగ్రీ పూర్తవడంతోనే ఐ.ఎ.ఎస్ కి ప్రిపేర్‌రయింది. విజయం సాధించింది. శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్‌గా అపాయింట యింది. ఐదేళ్ళు తిరక్కుండానే ఇప్పుడు ప్రమోషన్ మీద జిల్లా కలెక్టర్‌గా విజయనగరం వచ్చింది.

★★★

"నాడు కామేశ్వరి నాకు అండగా ఉండకపోతే నా జీవితం ఎలా ఉండేదో!" చెమ్మగిల్లిన కళ్ళను పయిట చెంగుతో వత్తుకుంటూ అంది కల్యాణి.

ఆమెను చూస్తుంటే మాటలు రావడంలేదు మంజూషకి. "పైకి ఎంతో గంభీరంగా కనిపించే కల్యాణి వెనుక ఇంత విషాద గాధ ఉందా!..." అనుకుంది.

